బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

రైలు మార్గం.. నిర్మాణంలో జాప్యం..!

- నిర్మాణ దశలోనే రాయదుర్గం - తుమకూరు రైలు మార్గం
- మూడేళ్లలో పూర్తి చేస్తామంటూ కేంద్ర మంత్రి ప్రకటన
- ఆచరణలో పనుల్లో కనిపించని వేగం

రాయదుర్గం- తుమకూరు పట్టణాల మధ్య రైలు మార్గ నిర్మాణం వచ్చే మూడేళ్లలో పూర్తి అయ్యేనా అని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 2027 ఫిబ్రవరి నాటికి రైలు మార్గ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తుమకూరు పార్లమెంటు సభ్యులు, కేంద్ర జల వనరులు, రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్న తరచూ సభలు, సమావేశాలు, పత్రికా విలేకరుల సమావేశాల్లో చెబుతూనే ఉన్నారు. దశాబ్ద కాలంగా కనీసం సగం దూరం కూడా రైలు మార్గం నిర్మాణ పనులు పూర్తి కాలేదు. ఈ పరిస్థితుల్లో వచ్చే మూడేళ్లలో రైలు మార్గ నిర్మాణం ఏ మేర పూర్తవుతుందో అన్న సందేహాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

206.53 కిలోమీటర్ల పొడవు గల రైలు మార్గ నిర్మాణ పనులను రూ.1714.50 కోట్ల అంచనాతో 2012లో ప్రారంభించారు. 2016 డిసెంబర్ నాటికి రాయదుర్గం -కళ్యాణదుర్గం రైలు మార్గ నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రారంభించారు. 2017 ఏప్రిల్ నెలలో కళ్యాణదుర్గం నుంచి కదిరిదేవరపల్లి వరకు రైలు మార్గ నిర్మాణం పూర్తి చేసి కదిరిదేవరపల్లి నుంచి తిరుపతికి ప్యాసింజర్ రైలు సర్వీసును ప్రారంభించారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంత ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉన్న ఈ రైలు సర్వీసు ఏడాది క్రితం మరమ్మతు, అభివృద్ధి పనుల సాకుతో నిలిపివేశారు. నెలనెలా రైలు సర్వీసును వాయిదా వేస్తూ వస్తున్నారు. ఏడాది గడిచినప్పటికీ ఇప్పటివరకు దీని మరమ్మతు, అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఈ ప్రాంత ప్రజలకు అనువుగా ఉన్న తిరుపతి- కదిరిదేవరపల్లి రైలు సర్వీసును పున్ణ ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నా అందుకు అనుగుణంగా పనులు ముందుకు సాగడం లేదు.

కదిరిదేవరపల్లి నుంచి దొడ్డహళ్లి వరకు రైలు మార్గాన్ని నిర్మించారు. రైల్వే సేఫ్టీ కమిషనర్ ఈ మార్గాన్ని తనిఖీ చేసి నిర్మాణంపై సంతృప్తి వ్యక్తం చేశారు. 206.53 కిలోమీటర్లకు గాను ప్రస్తుతం 103 కిలోమీటర్ల నిర్మాణం పూర్తికాగా104 కిలోమీటర్ల పనులు చేపట్టాల్సి ఉంది. రైలు మార్గ నిర్మాణం అంచనా వ్యయం రూ.1714.50 కోట్ల నుంచి రూ.2450 కోట్లకు పెరిగింది. నిర్మాణం వ్యయంలో రైల్వే శాఖ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం నిధులు సమకూర్చాల్సి ఉంటుంది. ప్రస్తుతం దొడ్డహళ్లి నుంచి కర్ణాటక రాష్ట్రంలోని పావగడ సమీపంలో గల కె.రాంపుర వరకు రైల్వే స్టేషన్, రైలు మార్గ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. తుమకూరు నుంచి ఉరుకెరే వరకు రైలు మార్గ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మార్చి నెలాఖరుకు ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యాన్ని రైల్వే అధికారులు నిర్దేశించారు.



ఉరుకెరె వద్ద నిర్మాణంలో ఉన్న రైలు మార్గం

డబ్లింగ్, కొత్త రైలు మార్గ నిర్మాణం ఎప్పుడో..?

రాయదుర్గం మీదుగా బళ్లారి నుంచి చిక్కజాజూరు వరకు 185 కిలోమీటర్ల డబ్లింగ్ పనులకు గత ఏడాది ఫిబ్రవరి నెలలో డిపిఆర్ రైల్వే శాఖకు సమర్పించారు. రాయదుర్గం నుంచి తుమకూరు (ఉరుకెరె) వరకు 194 కిలోమీటర్ల డబ్లింగ్ పనులకు రైల్వే బోర్డు ఆమోదం లభించాల్సి ఉంది. స్వామిహళ్లి నుంచి రాయదుర్గం వరకు 52 కిలోమీటర్ల కొత్త రైలు మార్గ నిర్మాణానికి 2022 సంవత్సరంలో రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సర్వే పనులు కొనసాగుతున్నాయి. రాయదుర్గం బళ్లారి సెక్షన్లో బాదనహాల్ వద్ద క్రాసింగ్ రైల్వే స్టేషన్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి.

భూ సేకరణ చిక్కులు

కర్నాటక రాష్ట్రంలో ఈ రైలు మార్గ నిర్మాణానికి వివిధ ప్రాంతాల్లో 36 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. 130 మంది భూ యజమానులకు పరిహారం చెల్లించాల్సి ఉంది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రక్రియను ఆమోదించగానే వెంటనే పరిహారం చెల్లిస్తామని రాయదుర్గం- తుమకూరు రైలు మార్గ భూ సేకరణ ప్రత్యేక అధికారి రేణు ప్రసాద్ జంబగి తెలిపారు. ఇంకా 10 గ్రామాల మధ్య భూ సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉరుకెరె- తుమకూరు నడుమ భూస్వాధీన ప్రక్రియ జరుగుతోంది.



రాయదుర్గం తుమకూరు రైల్వే మ్యాప్

ఉరుకెరె రైల్వే స్టేషన్ భవన నిర్మాణం

సానుకూల స్పందన

ఇటీవల కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్నను తుమకూరులో కలిసి రాయదుర్గం- తుమకూరు రైలు మార్గ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరాం. రాయదుర్గం రైల్వే స్టేషన్లో మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎక్స్‌ప్రెస్ రైలు ఆపాలని, రాయదుర్గం రైల్వే స్టేషన్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశాం. అర్ధాంతరంగా ఆగిన రైల్వే ఓవర్ బ్రిడ్జిలను నిర్మించడంతోపాటు బళ్లారి, బిటిపి రోడ్లలో కొత్త రైలు వంతెనలు నిర్మించాలని రైల్వే మంత్రిని కోరగా వీటిన్నింటిపై ఆయన సానుకూలంగా స్పందించారు.

కాలవ శ్రీనివాసులు ప్రభుత్వ విప్.

సమస్యలను విన్నవించాం..

రాయదుర్గం-తుమకూరు రైలు మార్గ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ఈ మార్గంలో పలు రైలు సర్వీసులను ప్రవేశపెట్టాలని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్నను కోరాం. రాయదుర్గం జంక్షన్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని విన్నవించాం.

అంబిక లక్ష్మీనారాయణ, అనంతపురం ఎంపీ.

రైల్వే స్టేషన్‌లో మౌలిక సౌకర్యాలు కరువు

రాయదుర్గం రైల్వే స్టేషన్ రైలు మార్గ నిర్మాణంలో భాగంగా కొత్త స్టేషన్‌ను నిర్మించారు. ఈ స్టేషన్‌లో ప్రయాణికులకు మౌలిక సౌకర్యాలు లోపించాయి. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, నీడ సదుపాయాలు లేవు. రూ.10.5 కోట్లు ఖర్చుచేసినా కనీసం రెండో ప్లాట్ ఫారం విస్తరణ, పైకప్పు ఏర్పాటు జరగలేదు.

రుణాల మంజూరులో జాప్యం వద్దు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంకర్లు కేటాయించిన లక్ష్యాలను నెల రోజుల్లోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కన్వరెన్స్ హాలులో డిఎల్‌టిసి జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లాస్థాయి సమీక్ష కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు కేటాయించిన లక్ష్యాలను చేరుకునేందుకు చిత్తశుద్ధితో పని చేయాలని ఆదేశించారు. వెనుకబడిన వర్గాలు, రైతులు, దళితులు, మహిళలకు ఎలాంటి ఉపాధి అవకాశాలు కలిగించామనే దిశగా ఆలోచన చేయాలన్నారు. కొన్ని బ్యాంకులు ఇప్పటి వరకు ఒక్క రుణం కూడా మంజూరు చేయకపోవడం సరికాదన్నారు. రుణాల మంజూరులో వంద శాతం లక్ష్యాలు చేరుకోవాలన్నారు. బీసీ కార్పొరేషన్, ఈబీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ కింద అర్హులైన వారందరికీ రుణాల మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం రమణ కుమార్, బీసీ కార్పొరేషన్ సుబ్రహ్మణ్యం, నాబార్డ్ ప్రతినిధి అనురాధ, వ్యవసాయ అధికారి సుబ్బారావుతో పాటు జిల్లా అధికారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో బిఎస్‌ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి

వెంకటరమణారెడ్డి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణ నాగులబావి కాలనీకి చెందిన బిఎస్‌ఎఫ్ జవాను వెంకటరమణారెడ్డి (40) కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డి బిఎస్‌ఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం వీరి కుటుంబం ధర్మవరం పట్టణంలో నివాసం ఉంటోంది. ఇటీవల కాశ్మీర్‌లో అతి తక్కువ ఉష్ణోగ్రత ఉండడంతో వెంకటరమణారెడ్డి బుధవారం నాడు గుండెపోటుకు గురై మరణించాడు. ఈ మేరకు సమాచారాన్ని ఆర్మీ అధికారులు కుటుంబ సభ్యులకు అందించారు. మృతునికి భార్య హరిప్రియ, కుమారుడు మహిధర్ రెడ్డి, కుమార్తె రిత్విక ఉన్నారు. జవాను పార్థివదేహం కాశ్మీర్ నుంచి ధర్మవరానికి గురువారం రాత్రి చేరుకుంటుందని ఆర్మీ వర్గాలు తెలిపాయి. జవాను స్వగ్రామం బసినేపల్లిలో అంత్యక్రియలు నిర్వహించేందుకు అధికారులు, కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. జవాను ఆకస్మిక మృతిపై గ్రామస్తులు, స్నేహితులు, మాజీ ఆర్మీ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

లో వోల్టేజీ సమస్యపై రైతుల నిరసన

నిరసన తెలుపుతున్న రైతులు

ప్రజాశక్తి-అగళి

మండలం లోని హెచ్‌డి.హళ్లి పంచాయతీలో విద్యుత్ లో వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో లో వోల్టేజీ సమస్యతో కాలిపోయిన మోటార్లతో రైతులు గురువారం విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. బాధిత రైతులు మాట్లాడుతూ హెచ్‌డి.హళ్లి పంచాయతీ సరిహద్దులో ఉన్న బోరు బావులకు ఏర్పాటు చేసిన మోటార్లు ఏడాది కాలంగా విద్యుత్ లో వోల్టేజీ సమస్య కారణంగా తరచూ కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఏఈ లేకపోవడంతో ఏడాదిగా తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. విధి లేని పరిస్థితుల్లో ఇలా కాలిపోయిన మోటార్లు తీసుకొచ్చి నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. సబ్ స్టేషన్ సిబ్బంది ఫోన్ ద్వారా వీరి సమస్యను రొళ్ల ఇన్‌ఛార్జి ఏఈ బాషాకు వివరించారు. స్పందించిన ఏఈ సత్వరమే లో ఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. అయితే మండలానికి రెగ్యులర్ ఏఈని నియమించాలని రైతులు కోరారు

రిమాండ్ ఖైదీ మృతి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న కేశవ నారాయణ(50) అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పామిడి మండలం దేవరపల్లికి చెందిన కేశవనారాయణ ఆలియాస్ శ్రీనివాసులు బత్తలపల్లి మండలంలో రైతుల నుంచి పశువులు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించలేదు. దీంతో రైతులు బత్తలపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేవారు. ఈ ఫిర్యాదు మేరకు బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి ఈనెల 2వ తేదీన కేశవ నారాయణను అరెస్టు చేసి ధర్మవరం సబ్ జైలుకు రిమాండ్‌కు పంపారు. జైలులో ఉండగా ఈనెల 15వ తేదీన ఆయన అస్వస్థకు గురయ్యాడు. సబ్ జైలు అధికారులు చికిత్స నిమిత్తం ఆయన్ను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కేశవ నారాయణ మృతి చెందాడు. జైలు, ఆసుపత్రి నియమ నిబంధనల ప్రకారం కార్యక్రమాలను పూర్తి చేసిన తర్వాత కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేస్తామని సబ్ జైలు అధికారి తెలిపారు.

అంగన్వాడీ హెల్పర్లకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలి- సిఐటియు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా అర్హత ఉన్న అంగన్వాడీ హెల్పర్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని, లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని అంగన్వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు జిల్లా యూనియన్ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ టిఎస్.చేతన్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ అర్హత ఉన్న హెల్పర్లకు ఉద్యోగోన్నతులు కల్పించకుండానే ఐసిడిఎస్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయడం సమంజసం కాదని, వెంటనే రద్దు చేయాలన్నారు. సంక్రాంతి పండుగ సెలవులు ఉన్న సందర్భంగా దరఖాస్తు చేసుకోవడానికి కూడా అధికారులు సమయం ఇవ్వకపోవడం దుర్మార్గం అన్నారు. వివిధ ప్రాజెక్టుల్లో 15-20 ఏళ్ల పాటు పని చేస్తున్న హెల్పర్లు ఉద్యోగోన్నతులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ఈ నోటిఫికేషన్ రద్దుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నోటిఫికేషన్‌లో ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, మడకశిర, పెనుకొండ ప్రాజెక్టులలో ఒక్కొక్కరు ఉన్నారన్నారు. అర్హత ఉండి ఉద్యోగోన్నతికి నోచుకోని వారు పలువురు ఉన్నారన్నారు. నోటిఫికేషన్ రద్దు చేసి అర్హులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు సుజాత, మంజుల, హెల్పర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

గురుకుల పాఠశాల భవనాల పరిశీలన

అసంపూర్ణంగా నిలిచిన భవనాలను పరిశీలిస్తున్న గుండుమల తిప్పేస్వామి, అధికారులు

ప్రజాశక్తి-గుడిబండ

మండల కేంద్రమైన గుడిబండలో అసంపూర్ణంగా నిలిచిపోయిన గురుకుల పాఠశాల భవనాలను గురువారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, బీసీ వెల్ఫేర్ ఎండి దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ 2014-19 సమయంలో అప్పటి టిడిపి ప్రభుత్వం బాలికల గురుకుల పాఠశాలను మంజూరు చేయడంతో పాటు భవన నిర్మాణం పనులు 80 శాతం పూర్తి చేసిందన్నారు. ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి రావడం, అప్పటి స్థానిక ఎమ్మెల్యే కాంట్రాక్టర్లను డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు బెదిరించడంతో వారు పనులను ఆపేశారన్నారు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సిఎం చంద్రబాబు మడకశిర పర్యటనకు వచ్చిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో కలిసి గురుకుల పాఠశాల విషయాన్ని ఆయనకు వివరించామన్నారు. స్పందించిన సిఎం గురుకుల పాఠశాల భవన నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. అందులో భాగంగానే బీసీ వెల్ఫేర్ ఎండి దేవేందర్‌రెడ్డి, ఎస్ఇ శివకుమార్, ఈఈ రమణారెడ్డితో కలిసి గుండుమల తిప్పేస్వామి గుండుమల బాలుర గురుకుల పాఠశాల, గుడిబండ బాలికల గురుకుల పాఠశాల భవనాలను పరిశీలించారు. వెంటనే భవన నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని వారు గుండుమల తిప్పేస్వామికి హామీ ఇచ్చారు. వారి వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు శివకుమార్, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్, బూదిపల్లి జయరామ్, శీన, హనుమంతు, జనార్ధన్, రుద్రముని, నిరంజన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీరామప్ప ఉన్నారు.

కియాలో సైరోస్ ప్రీ బుకింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-పెనుకొండ

కియా సైరోస్ ప్రీ బుకింగ్‌ను కియా ఇండియా గురువారం ప్రారంభించింది. పెనుకొండ మండలం యర్రమంచిలో ఉన్న పరిశ్రమలో కియా కార్పొరేషన్ ప్రెసిడెంట్, సీఈవో హెరీ సంగ్ సాంగ్, కియా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ గ్వాంగులీతో సహా సీనియర్ కియా ఎగ్జిక్యూటివులు ప్రీ బుకింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కియా కార్పొరేషన్ ప్రెసిడెంట్, సీఈవో హెరీ సంగ్ సాంగ్ మాట్లాడుతూ భారతీయ ఆటోమోటివ్ ల్యాండ్‌స్కేప్ను భవిష్యత్ ఎస్‌యువి సైరోసు అన్నారు. భవిష్యత్ ఫీచర్లు సెగ్మెంట్- లీడింగ్ ఇన్నోవేషన్స్, ప్రతి కొత్త మోడళ్లలో తీసుకువస్తామన్నారు. కియా సైరోస్‌లో ఆధునిక టెక్నాలజీ ఉపయోగించామన్నారు. కియా సైరోస్లో అత్యాధునిక ఫ్యూచర్స్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సిరోసను రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఒ షెమారంజయ్, కియా ఉద్యోగులు పాల్గొన్నారు.

సైరోస్ ఆవిష్కరణ సందర్భంగా కియా సిబ్బంది, ప్రతినిధులు

'పిఎం ఇంటర్న్‌షిప్'ను సద్వినియోగం చేసుకోండి

పుట్టపర్తి క్రైమ్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పిఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. ఇందులో భాగంగా ప్రతిష్టాత్మక కంపెనీల్లో ఉపాధి అవకాశం కల్పిస్తారన్నారు. 6 నుంచి 12 నెలలు శిక్షణ ఉంటుందని, తగిన గౌరవ వేతనం ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం పలు కంపెనీల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ నెల 21వ తేదీ లోపు నైపుణ్యాభివృద్ధి సంస్థలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 18-24 ఏళ్ల వయసు ఉండి పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్, బిఏ, బిఎస్సి, బి-ఫార్మసీ, బీసీఏ, బీటెక్ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 93986 43930లో సంప్రదించాలన్నారు.

మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దాతృత్వం

ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన చాకలి నారాయణప్ప(54) గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి మండల నాయకులు ఆ గ్రామం వెళ్లి నారాయణప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నారాయణప్ప కుమారుడు గణేష్ ఎంబిఎ చదువుతున్నారు. ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న రెడ్డిపల్లి పంచాయతీకి చెందిన గోని మేకలపల్లి వెంకట్రామిరెడ్డి గణేష్ చదువుకు రెండేళ్లకు అయ్యే ఖర్చు రూ. 60 వేలు ఆర్థిక సాయం చేస్తానని ప్రకటించారు. అందులో భాగంగానే అక్కడికక్కడే గణేష్‌కు రూ. 10వేలు అందజేశారు. దీంతో వెంకట్రామిరెడ్డిని పలువురు నాయకులు అభినందించారు. కార్యక్రమంలో చిన్నప్పయ్య, చంద్రమౌళి, టైలర్ ఆంజనేయులు, చిన్నమంతూరు పవన్, ఆర్.కొట్టాల శ్రీనాథ్‌చౌదరి, హరీష్, మాజీ ఎంపీపీ నరసింహులు, పుల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఫిబ్రవరి 8, 9 తేదీల్లో పట్టణంలో ఎపి స్టేట్ అసోసియేషన్ కార్యదర్శి సుమన్ ఆధ్వర్యంలో 7వ రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఈ టోర్నీ నిర్వహణపై గురువారం యువర్స్ ఫౌండే షన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తపేట-రాంనగర్‌లో ఉన్న శ్రీఉషోదయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో సమావేశం నిర్వహించారు. జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రవేశరుసుము రూ. 600 అని, మొత్తం 41 మంది విజేతలకు రూ. 60 వేలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. చెస్ క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి ఏర్పాటు చేస్తామన్నారు. వివరాలకు 99126 47370, 08559-2218132 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి మోహన్, చాంద్‌బాషా, టోర్నమెంట్ ఆర్గనైజర్ డైరెక్టర్ పురుషోత్తం, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉషోదయ పాఠశాలలో సమావేశమైన చెస్ టోర్నీ నిర్వాహకులు

పింఛనుదారుల సర్టిఫికెట్ల పున:పరిశీలన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఈ నెల 21, 22 తేదీల్లో సామాజిక భద్రత పింఛనుదారుల ఆరోగ్య పరిస్థితులు, హెల్త్ సర్టిఫికెట్లను పున్ణపరిశీలన చేయడానికి వైద్యుల బృందం వారి ఇళ్లను సందర్శిస్తారని ఎంపిడిఒ సాయిమనోహర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇదివరకే పింఛనుదారులకు నోటీసులు పంపామని, నోటీసు అందుకున్న పింఛనుదారులు ఇంటి వద్దనే ఉండి, వైద్యుల బృందానికి సహకరించాలన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉండాలన్నారు. వైద్యులు డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ ఎం.సుమలత 21వ తేదీ ఏలుకుంట్ల, నేలకోట, దర్శనమల, రావులచెరువు, ధర్మపురి, మల్లాకాలువ, సిసి కొత్తకోటలో, 22న రేగాటిపల్లి, కునుతూరు, పోతుకుంట, చిగిచెర్ల, గొట్లూరు-1, 2, తుమ్మల గ్రామాల్లో పింఛనుదారుల సర్టిఫికెట్లను పరిశీలిస్తారన్నారు. వారికి పింఛనుదారులు సహకారించాలని తెలిపారు.

కల్తీ నూనె కలవరం..!

పండుగల వేళ యథేచ్ఛగా అమ్మకాలు
ప్రజల ప్రాణాలతో చెలగాటం
మామూళ్ల మత్తులో ఆహార భద్రత అధికారులు....?

అపరిశుభ్రంగా ఉన్న అండర్ గ్రౌండ్ ట్యాంక్ ప్రదేశం

ప్రజాశక్తి-హిందూపురం

ఇటీవల వంటనూనెల్లో కల్తీ జరుగుతోందనే భయం జనాన్ని కలవారపాటుకు గురి చేస్తోంది. కల్తీ నూనెతో చేసే ఆహార పదార్థాలను తింటే తక్కువ సమయంలోనే అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్న వాళ్లం అవుతామంటూ వైద్యులు చెబుతున్నారు. కొంత మంది నూనె వ్యాపారులు వారి స్వార్థం కోసం కల్తీ నూనెలను విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కనీసం నూనె ట్యాంకర్లను శుభ్రం చేయకుండానే లూజు విక్రయాలను జరుపుతున్నారు. కల్తీపై పెద్ద ఎత్తున విమర్శలున్నా ఆహార భద్రత అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడం గమనార్హం.

హిందూపురం పట్టణంలో భారత్ ఆయిల్ డిపో, బాలాజీ ట్రేడర్స్, భవిత ట్రేడర్స్ పేరుతో రోజుకు వేలాది లీటర్ల వంటనూనె లూజు విక్రయాలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. ప్రత్యేక ట్యాంకర్లను ఏర్పాటు చేసుకుని ఇతర ప్రాంతాల నుంచి వారు దిగుమతి చేసుకుంటున్నారు. నూనెల లూజ్ విక్రయాలపై నిషేధం ఉన్నా అమ్మకాలు సాగుతూనే ఉన్నాయి. లూజు విక్రయాలపై ఆహార భద్రత అధికారులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అలాంటి దాడులు జిల్లా వ్యాప్తంగా ఎక్కడా పూర్తి స్థాయిలో జరిగిన దాఖలాలు లేవు. పండుగ సమయాల్లో కల్తీ నూనె, కల్తీ నెయ్యి, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. డాల్డాలో కృత్రిమ రంగులు కలిపి నెయ్యిగా మారిస్తే, పసుపు పచ్చ పత్తినూనెతో పల్లీనూనె కల్తీ చేస్తున్నారు. తెల్లపత్తి నూనెను పొద్దుతిరుగుడు ఆయిల్‌లో కలుపుతారనే ఆరోపణలు ఉన్నాయి. వంట నూనెలను ప్లాంట్ నుంచి వ్యాపారులకు రవాణ చేసే ట్యాంకర్లను, వ్యాపారులు వారు స్టాకు చేసుకునే ట్యాంకర్లను పరిశీలిస్తే యథేచ్ఛగా కల్తీ నూనెల బండారం బయటపడే అవకాశాలు ఉన్నాయి. కల్తీ వంట నూనెల్లో విషపూరితమైన అఫ్లాటాక్సిన్లు, ఆరోగ్యానికి హాని చేసే హెవీ మెటల్స్ ఉంటున్నట్లు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) నిర్వహించిన పరీక్షల్లో తేలింది. వీటి నియంత్రణకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని ఎఫ్ఎస్ఎస్ఎఐ సూచించింది. వంట నూనెను ప్యాకెట్లలో తయారు చేస్తున్న అక్రమార్కులు ఆ ప్యాకెట్లపై ఎలాంటి వివరాలూ ఉంచడం లేదు. ఏయే రకాల నూనెలు కలిపారు. నూనె తయారు చేసిన సంస్థ వివరాలు, ప్యాకింగ్ చేసిన తేదీ, ప్లాంటు వివరాలు, కలిపిన కెమికల్స్ వంటి వివరాలతో కూడిన డిక్లరేషన్‌ను ప్యాకెట్లపై ముద్రించాలనే నిబంధన ఉన్నా చాలా వాటికి అమలు కాలేదు. నాణ్యత లేని వంట నూనెలతో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీంతో పాటు మలబద్ధకం, ఒళ్లు నొప్పులు, హార్ట్ ఎటాక్, పక్షవాతం తదితర చాలా జబ్బులు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

దుకాణంలో లూజు నూనె విక్రయాలు

కల్తీపై చర్యలు శున్యం

జిల్లాలో ప్రధాన పట్టణాలతో పాటు వివిధ మండలా ల్లో కల్తీ సరుకుల అమ్మకాలకు అనేక పద్ధతులు ఉపయోగిస్తున్నారు. నూనెల్లో ఆముదం, ఖనిజ తైలం, జంతువుల కొవ్వును కరిగించి కల్తీ చేయడం, సోయాబీన్, పత్తిగింజలు, పామోలిన్ వంటి నూనెలను కల్తీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆహారపు పరిరక్షణ ప్రమాణపు చట్టం ప్రకారం 2006, నిబంధనల నియామవళి చట్టం 2011 వరకు పరిరక్షణ లేని ఆహార పదార్థాలను తయారు చేసినా, అమ్మినా, నిల్వ ఉంచినా, సరఫరా చేసినా, దిగుమతి చేసుకున్నా, లైసెన్స్ లేకపోయినా చట్టరీత్యా నేరం. ఏడాది వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. కానీ విచ్చల విడిగా ఆహార పదార్థాలు తయారు చేస్తున్నా నియంత్రించిన దాఖలాలు లేవు.

మామూళ్లు.. నిద్ర మత్తులో ఆహార భద్రత అధికారులు..?

కల్తీ వంట నూనెతో పాటు కల్తీ పదార్థాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన ఆహార భద్రత అధికారులు వ్యాపారులు ఇచ్చే మామూళ్ల మత్తులో ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. నెలలో ఒక్క సారి సైతం తనిఖీలు చేపట్టిన పరిస్థితి లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్తీపై విస్తృత తనఖీలు నిర్వహించి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని ప్రజారోగ్యాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

మహిళను అవమానించిన వ్యక్తులను అరెస్టు చేయాలి

నేడు వ్యకాసం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు

ప్రజాశక్తి-పెనుకొండ

మండలంలోని మునిమడుగు గ్రామంలో వెంకటలక్ష్మి పట్ల అమానుషంగా ప్రవర్తించిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. పట్టణంలో గురువారం వ్యకాసం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహిం చారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలపై జరుతుగున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం, అధికారులు విఫలం అయ్యారన్నారు. హోం మంత్రి స్పందించి విచారణ వేగవంతంగా జరిగేలా పోలీసు శాఖను ఆదేశించాలని కోరారు. బాధితురాలికి రక్షణ కల్పించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వ్యకాసం ఆధ్వర్యంలో నిరసనకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కోశాధికారి సాకే వెంకటేశులు జిల్లా ఉపాధ్యక్షులు నార్పింపల్లి ఆంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత , రమాదేవి, నారాయణ పాల్గొన్నారు.

మహిళపై దాడి హేయం : ఐద్వా

సోమందేపల్లి : మునిమడుగు గ్రామంలో మహిళపై దాడి చేయడం హేయమైన చర్య అని ఐద్వా జిల్లా నాయకులు గౌతమి తెలిపారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక జగ్జీవన్‌రామ నగర్‌లో కాలనీ వాసులతో కలిసి మహిళపై దాడిని తీవ్రంగా ఖండించారు. గౌతమి మాట్లాడుతూ మహిళా మంత్రి ఉన్న నియోజకవర్గంలో మహిళపై ఇలా దాడి జరగడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తుందన్నారు. నిందితులను తక్షణం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మంత్రి సవిత స్పందించకపోవడం దుర్మార్గం అన్నారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటా మన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు లలిత, అంబిక, రూపా, పూజ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

వడ్డెర్ల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వడ్డెర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్ టిఎస్.చేతన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి ఉత్తన్న, ప్రధాన కార్యదర్శి గోగుల చక్రపాణి మాట్లాడుతూ పుట్టపర్తిలో వడ్డెర సంక్షేమ భవనం నిర్మించాలని, ఎస్టీ జాబితాలో చేర్చాలని, కొండ, గుట్టల్లో ఉన్న క్వారీల్లో 35 శాతం రాయితీ, ప్రతి మండల కేంద్రంలో వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు, వడ్డెర్ల రక్షణకు ప్రత్యేక చట్టం, క్వారీలు, గనుల్లో ప్రమాదాలకు గురైతే ప్రమాద బీమా రూ. 10 లక్షలు మంజూరు చేయాల న్నారు. ఆదరణ పథకం కింద ఆధునిక పనిముట్లు, 50 ఏళ్లు నిండిన వడ్డెర్లకు పింఛను ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు, జాతీయ ఉపాధ్యక్షులు పల్లపు జయచంద్ర మోహన్, దండగల మారెప్ప, గంగులప్ప, గంగరాజు పాల్గొన్నారు.

కలెక్టర్ టిఎస్.చేతన్‌కు వినతిపత్రం ఇస్తున్న వడ్డెర నాయకులు

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

18న రక్తదాన శిబిరం

ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతి పురస్కరించుకొని ఈ నెల 18వ తేదీ పట్టణంలోని మదనపల్లి రోడ్డులో ఉన్న పివిఆర్ ఫంక్షన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను ఈ నెల 18వ తేదీ నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

చెర్లోపల్లిలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్వగ్రామం రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి లక్షలు విలువ చేసే మినరల్ వాటర్ ప్లాంట్ నెలకొల్పగా, మరొకరు ప్లాంట్‌కు అవసరమైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చి పలువురికి ఆదర్శంగా నిలిచారు. మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాగే నారాయణస్వామి సొంత ఖర్చులతో నారమ్మ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా గురువారం టిడిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి ప్రారంభించారు. రాగే నారాయణస్వామి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ సొంతూరులో ప్రజలకు ఉపయోగపడేలా రూ. 5.5 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన కప్పల బాలకృష్ణ స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. వీరి సహకారంతో గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. రూ. 5 కాయిన్ వేస్తే 20 లీటర్ల సురక్షిత తాగునీరు వచ్చేలి ఏర్పాటు చేశారు. ఇలా వచ్చిన మొత్తాన్ని ప్లాంట్ నిర్వహణకు ఉపయోగిస్తామని రాగే నారాయణస్వామి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎంవి చౌదరి, రాము, ప్రవీణ్, నాగభూషణ, నారాయణస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి

19న యోగి వేమన జయంతి

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు ఆశీస్సులతో పట్టణంలో ఈ నెల 19వ తేదీ యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పామిశెట్టి ఆదినారాయణ తెలిపారు. అదే రోజు వేమన భగవాన్ చిత్ర పటాన్ని ఊరేగిస్తామన్నారు. ఊరేగింపు ముద్దిరెడ్డిపల్లి భాగ్యనగర్ నుంచి ప్రారంభమై వాల్మీకి సర్కిల్ వరకూ సాగుతుందన్నారు. జయంతి వేడుకలను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక, రెడ్డి జెఎసి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగి వేమన జయంతి వేడుకల్లో పట్టణ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కళాశాల మైదానంలో శ్రమదానం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

'స్వచ్ఛ ధర్మవరం'లో భాగంగా గురువారం బిజెపి నాయకులు, కార్యకర్తలు మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి పట్టణంలోని కళాశాల మైదానంలో శ్రమదానం చేసి చెత్తను తొలగించి శుభ్రం చేశారు. వారు మాట్లాడుతూ మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలని, స్వచ్ఛ ధర్మవరంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, శ్యామరావు, పట్టణ అధ్యక్షులు జింకా చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబిలేసు, కొండమీదరాయుడు, నాగభూషణం, జూటూరు వెంకటేష్, మంజునాథ్, మహేష్, నబిరసూల్, సోమ్లానాయక్, మిర్యాల అంజి, రాధమ్మ, శారదమ్మ, ఈశ్వర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని శుభ్రం చేస్తున్న బిజెపి నాయకులు, మున్సిపల్ సిబ్బంది

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని మాల్యవంతం గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంటలో గురువారం వ్యవసాయ అధికారులు పంట కోత ప్రయోగాలు చేపట్టారు. ఎఎస్ఒ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ ఆధ్వర్యంలో ఎంపిఇఒ ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, విఎఎ లావణ్యలత పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. పంటకోత ప్రయోగాలను బీమా కంపెనీ కోఆర్డినేటర్లు మంజునాథ్, శ్రీనివాసులు, బాషా పర్యవేక్షించారు. వారి వెంట రైతులు రాజేంద్రప్రసాద్, రాంప్రసాద్ ఉన్నారు.

పెనుకొండకు త్వరలో మరిన్ని పరిశ్రమలు

ప్రజాశక్తి-పెనుకొండ

నగర పంచాయతీ రూపురేఖలు మారుస్తామని, త్వరలో పెనుకొండకు మరిన్ని పరిశ్రమలు రాబోతున్నాయని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. పట్టణంలో రూ. 53 లక్షల వ్యయంతో చేపట్టిన రైల్వేస్టేషన్ రోడ్డుకు వెళ్లే రహదారి, రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టిన కోనాపురం రోడ్డు, రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైయినేజీ పనులకు గురువారం మంత్రి భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో చేయని అభివృద్ధిని మేము 6 నెలల్లోనే చేసి చూపించామన్నారు. వైసిపి ప్రభుత్వంలో పెనుకొండ నగర పంచాయతీ అభివృద్ధిని గాలికి వదిలేసారని, మంత్రిగా ఉన్న శంకర నారాయణ కనీసం ఆయన వాకింగ్ చేసే రోడ్డు వేయలేకపోయారని విమర్శించారు. ఎన్నికల హామీ మేరకు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశామన్నారు. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి నారాయణస్వామి, మాజీ ఎంపీపీ కేశవయ్య, టిడిపి మండల అధ్యక్షులు సిద్దయ్య, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

గోరంట్ల మండలంలోని రెడ్డిచెరువుపల్లి సర్పంచి వినోద్‌కుమార్‌తో పాటు మరో 29 కుటుంబా లు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. మందలపల్లి పంచాయతీలోని కరావులపల్లి టిడిపి నాయకుల ఆధ్వర్యంలో 13 మంది నాయకులతో పాటు పలువురు టిడిపిలో చేరగా మంత్రి సవిత పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పలువురు టిడిపి వైపు ఆకర్షితులవుతున్నారన్నారు.

రొద్దం : మండలంలో మంత్రి సవిత పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. రొద్దంలో పాడి రైతు చెన్నకేశవులుకు ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం షెడ్డును స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గోకులం షెడ్డులను నిర్మించి పాడి పశువుల రైతుల అభివృద్ధికి తోడ్పడిందన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో రూ. 50 లక్షల వ్యయంతో అదనపు గదుల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం నల్లూరు గ్రామం నుంచి దందేపల్లి క్రాస్ వరకూ రూ. 1.18 కోట్ల వ్యయంతో రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. మంత్రి వెంట ఎంపీడీవో రామకుమార్, ఏపీవో అనిల్ కుమార్, టిడిపి మండల కన్వీనర్ నరహరి, సీనియర్ నాయకులు మాధవ నాయుడు, చంద్రమౌళి, చిన్నప్పయ్య, వెంకట్రామిరెడ్డి, చిన్నమంతూరు పవన్, శ్రీనాథ్ చౌదరి, వీరాంజి, పెద్దగువ్వలపల్లి పవన్‌కుమార్, గుబ్బరంపల్లి రవి, డీలర్ల సంఘం అధ్యక్షులు సిద్దన్న, కల్లకుంట హనుమంతరాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు ఉన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి సవిత భూమిపూజ

పెనుకొండలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

ప్రయాణికులను క్షేమంగా గమ్యం చేర్చాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఆర్టీసీ డ్రైవర్లు సురక్షిత, లక్షణాత్మక డ్రైవింగ్ విధానాలు పాటించి ప్రయాణికులను క్షేమంగా గమ్యానికి చేర్చాలని జిల్లా ఆర్టీసీ రవాణా శాఖ అధికారి మధుసూదన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని డిపోలో గురువారం ఆయన రోడ్డు భద్రత మాసోత్సవాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకూ ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రక్షణాత్మక డ్రైవింగ్ విధానాలు అవలంబించాలన్నారు. ప్రమాదాల వల్ల జరిగే ప్రాణ నష్టం, గాయాల పాలు కావడం, తదితర అంశాలను వివరిస్తూ పుట్టపర్తి జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కోరారు. డ్రైవర్లు తగిన విశ్రాంతి తీసుకుంటూ ఏకాగ్రతతో బస్సు నడపాలన్నారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడపరాదని, మత్తు బారిన పడకూడదన్నారు. ఆర్టీసీపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని నిలబెట్టాలని, సిబ్బంది ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి హరిత, గ్యారేజ్ ఇన్‌ఛార్జి విజయానంద్, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించండి

కదిరి టౌన్ : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆర్డీవో వెంకట సన్యాసి శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి, ఆర్టీవో శ్రీనివాసులు వాహన చోదకులకు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకొని గురువారం వారు రహదారి భద్రతా అవగాహన ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనం నడపరాదని, హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. రహదారి సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంవిఐ వరప్రసాద్, రూరల్ సిఐ నాగేంద్ర, వాహనదారులు, డ్రైవింగ్ స్కూల్ యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో గురువారం డిపో మేనేజర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలపై సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన టూ టౌన్ సిఐ రెడ్డప్ప మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమ నిబంధనలను వివరించారు. డ్యూటీ టైంలో మొబైల్ మాట్లాడకుండా ఏకాగ్రత డ్రైవ్ చేయాలన్నారు. అలాగే పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో ట్రాఫిక్ సూపర్ వైజర్, వారి సిబ్బంది, గ్యారేజ్ సూపర్వైజర్, వారి సిబ్బంది కలిసి సుమారు 45 మంది పాల్గొన్నారు.

పుట్టపర్తిలో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఆర్టీసీ రవాణా శాఖ అధికారి మధుసూదన్

మాజీ సైనికులకు సన్మానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఆర్మీ డే పురస్కరించుకొని గురువారం పట్టణంలోని యువర్స్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో మాజీ సైనికులైన రేణిగుంట శ్రీధర్, వంకదారు మోహన్‌ను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని కొత్తపేట-రాంనగర్‌లోని ఉషోదయ ఇంగ్లీష్ మీడి యం హైస్కూల్‌లో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, ఉపాధ్యక్షులు సుంకు సుకుమార్, కార్యదర్శి జయరామ్‌తో పాటు సభ్యులు వారిని సన్మానించారు. యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ వీరిద్దరూ 20 ఏళ్ల పాటు దేశ సరి హద్దులో విధులు నిర్వర్తించారని, ఉద్యోగ విరమణ తర్వాత వీరిని సన్మానించడం గర్వంగా ఉందన్నారు. సన్మాన గ్రహీతలు, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు మాట్లా డుతూ దేశానికి తమ వంతుగా కృషి చేశామని, భవిష్యత్తులో కూడా దేశానికి అండగా ఉంటూ, అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. తమను గుర్తించి యువర్స్ ఫౌండేషన్ వారు సన్మానించడం జీవితంలో మరుపు రాని రోజు అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కట్టకిందపల్లిలో గ్రామసభలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

కట్టకిందపల్లిలో పోలీసుల గ్రామసభ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని కునుతూరు పంచాయతీ పరిధిలోని కట్టకిందపల్లి గ్రామంలో గురువారం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి గ్రామసభ ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు గొడవలకు, పేకాటకు, తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాల న్నారు. మద్యానికి బానిస కాకూడదని, సైబర్ క్రైమ్, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది, రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన చాకలి నారాయణప్ప(54) గురువారం మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎంపి బికె.పార్థసారథి అల్లుడు శశిభూషణ్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ ఆ గ్రామం వెళ్లి నారాయణప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఆయన కుబుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట టిడిపి నాయకులు వెంకటరామిరెడ్డి, వెంకటరత్నం, సత్తిశేఖర్, హరీష్, ఎల్.వెంకటరాముడు ఉన్నారు.



నారాయణప్ప కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

నూతన ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-తలుపుల

మండలంలోని నూతన కాలువ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారాముల ఆలయ నిర్మాణానికి గురువారం టిడిపి నాయకులు మేడా శంకర వీర ప్రసాద్ రూ. 20 వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్ర మంలో మాజీ సర్పంచి ఓబుళరెడ్డి, నాయకులు రాజా, చక్ర, ప్రభాకర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న మేడా శంకరవీరప్రసాద్

నేరాలు ఘోరాలు

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం-మలగూరు రైల్వే స్టేషన్ మధ్యలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం రైలు పట్టాలపై లభ్యం అయినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ విషయంపై రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ వివరాలను వెల్లడిస్తూ మృతుడి వయస్సు 35-40 సంవత్సరాలు ఉంటుందన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రొద్దం

రెండు రోజుల క్రితం పెనుకొండ పేట్లలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా వీరన్న(45) గురువారం మృతి చెందాడు. ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వీరన్నను రెండు రోజుల క్రితం బెంగళూరులోని ఓ ఆసుపత్రికి తరలించారు. అయితే అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యం చేసినా ఫలితం లేదని ఇంటికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో బంధువులు అక్కడి నుంచి పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వారు ఆసుపత్రికి రాగానే వీరన్న మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వీరన్న (ఫైల్‌ఫొటో)

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-గుడిబండ

గుడిబండ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. గ్రామ శివారులో బహిరంగ స్థలంలో కొందరు పేకాట ఆడుతుండగా సిబ్బందితో కలిసి దాడి చేసి మోరుబాగల్, వీరజ్జనపల్లి గ్రామాలకు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 4,150 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ కానిస్టేబుళ్లు మహమ్మద్ రఫీ, పాతన్న పాల్గొన్నారు.

కదిరి-రాయచోటి రోడ్డు గుంతలమయం!

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రమైన నంబులపూలకుంటలో కదిరి-రాయచోటి రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తహశీల్దార్ కార్యాలయానికి సమీపంలో కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై నీరు నిలిచి బురదమయం అవుతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు కార్యాలయానికి వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు రోజూ ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారు. ప్రధాన రహదారిలో మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి రోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతల మాయమైన రోడ్డు